క్లుప్తంగా

ఉద్యోగోన్నతి


పిన్నింటి శ్రీనివాస్

నెల్లిమర్ల: నెల్లిమర్ల సబ్ డివిజన్ ఇరిగేషన్ ఏఈ పిన్నింటి శ్రీనివాస్‌కు డీఈగా ప్రమోషన్ లభించింది. నెల్లిమర్ల, గుర్ల మండలాలకు ఏఈగా ఉన్న ఆయనకు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట డివిజన్‌లోని జలుమూరు సబ్ డివిజన్ పరిధిలో వంశధార నిర్వహణ విభాగం డీఈగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఉద్యోగోన్నతి పొందిన శ్రీనివాస్‌ను ఎంపీడీఓ రామకృష్ణరాజు, తహసీల్దార్ సుదర్శన రావు, ఇతర అధికారులు అభినందించారు.

జూట్ మిల్లును యథావిధిగా నడిపించాలి

నెల్లిమర్ల: జూట్‌మిల్లును యథావిధిగా నడిపించాలని జూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మిల్లుగేట్ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. ఇటీవల జూట్ యాజమాన్యం మగ్గాలు, లోడర్ ఫిట్టర్లను చూడాలని కార్మికులకు అదనపు బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. మిల్లును యథావిధిగా తిప్పేందుకు గతంలో ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. అదనపు బాధ్యతలు తప్పించి ఎప్పటిలాగే మిల్లును తిప్పకపోతే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

ప్రమాద బీమా సద్వినియోగం కావాలి


వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

బొండపల్లి: ఉపాధి వేతనదారుల కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనకు దరఖాస్తులు చేసుకొని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.తులసీనాధ్ సూచించారు. మండల కేంద్రంలోని జగ్గన్న బందలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులకు ఈ పథకంపై అవగాహన కల్పించారు. ప్రతి వేతనదారు ఏడాదికి 20 రుపాయలు చెల్లించి ఈ బీమాలో చేరవచ్చన్నారు. ప్రమాదవశాత్తు వేతనదారు మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా అందుతుందన్నారు. ఈ నెలాఖరులోగా తమ దరఖాస్తులను సంబంధిత క్షేత్ర సహాయకులకు అందజేయాలని సూచించారు. ఏపీఓ జి.అరుణ పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి పంచ హారతి బహూకరణ


వెండి పంచ హారతి అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి వెండి పంచ హారతిని బహూకరించారు. శుక్రవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గరివిడి మండలంలోని శివరాం గ్రామానికి చెందిన కుమిలి రమణ, పార్వతి దంపతులు అమ్మవారికి దీన్ని బహూకరించారు. రూ.12 వేలు వెచ్చించి దాదాపు 128 గ్రాముల వెండి పంచ హారతిని అమ్మవారికి దేవస్థానం ఈఓ బి.శ్రీనివాస్, ఆలయ అర్చకులు రవిశర్మలకు అందజేశారు.

జాబ్‌మేళా విజయవంతం


నియామక పత్రాలతో యువత

చీపురుపల్లి: పట్టణంలోని గాయత్రీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమయ్యింది. ఆ కళాశాల కరెస్పాండెంట్ దాసరి శివప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు పేటీఎం, అపోలో ఫార్మసీ, శ్రీవేన్ ఫార్మా, ఠాగూర్ ఫార్మా, యకోమా టైర్స్ తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. మేళాకు 200 మంది వరకు నిరుద్యోగ యువత హాజరయ్యారు. ఇందులో వంద మందికి పైగా యువతను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. అనంతరం వారికి కళాశాల కరస్పాండెంట్, కంపెనీల ప్రతినిధులు సంయుక్తంగా నియామక పత్రాలు అందజేశారు.

గ్రీవెన్స్ ఫిర్యాదుపై జేసీ విచారణ

కొత్తవలస : మండల కేంద్రం కొత్తవలస రెవెన్యూ పరిధి సర్వే నంబరు 142–1లో గెడ్డ వాగు నిర్ధారణపై మండలానికి చెందిన విన్నకోట గౌతం కలెక్టరేట్‌లో ఇటీవల జరిగిన గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ క్షేత్ర స్థాయిలో శుక్రవారం విచారణ జరిపారు. ఫిర్యాదుదారుడిని తహసీల్దార్ సమక్షంలో విచారణ నిర్వహించారు. ఈ సర్వే నంబరులో వాగు ఉందా...లేదా.. అనే అంశంపై పూర్తి స్థాయి రికార్డులతో వచ్చే శుక్రవారం మళ్లీ విచారణ చేస్తామన్నారు. అప్పటికి తహసీల్దార్, ఇరిగేషన్ జేఈ, ఫిర్యాదుదారులు కొత్తవలస తహసీల్దార్ కార్యాలయంలో హాజరు కావాలని జేసీ సూచించారు.

ఉపాధి వేతనదారుల ఆకలి కేకలు..


చినపతివాడలో ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతనదారులు (ఫైల్)

- మూడు నెలల బిల్లులు రూ. 12.72 కోట్లు పెండింగ్
- పనులకు వచ్చేందుకు ఆసక్తి చూపని వేతనదారులు
- సిబ్బందికి ఓ వైపు లక్ష్యాలు అధిగమించాలని వేధింపులు
- సుమారు రూ. 21 కోట్ల వరకు మెటీరియల్ కాంపోనెట్ బకాయిలు

పూసపాటిరేగ:

మండల పరిధిలోని ఉపాధి వేతనదారులకు బిల్లులు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. 12 వారాలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబాలను నెట్టుకురావడనికి ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ నిరుపేదలకు ఉపాధి కల్పించి వలసలు నివారించడమే లక్ష్యంగా ఏర్పాటైన ఉపాధి హామీ పథకం అధికారుల తీరుతో గాడి తప్పుతోంది. పనులు చేపట్టిన వారం రోజుల్లోనే వేతనం ఇవ్వాలన్న నిబంధన పక్కన పెట్టేశారు. ఎండల్లో ఎన్నో వ్యయప్రయాసల కోర్చి పనులు చేస్తున్నా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆకలితో అలమటించాల్సి వస్తోందని పలువురు వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మెటీరియల్ కాంపొనెట్ నిధులు కోట్లలో బకాయిలు వుండిపోయాయి.

లక్ష్యం ఇదే..

ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు గుర్తించి నిరుపేదలకు పనులు కల్పించాలి. ఒక్కొక్కరికీ రోజుకు 300 రుపాయల వరకు వేతనం వచ్చే విధంగా పనులు కల్పించాలి. వారానికి ఒకసారి వేతనాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలి. అయితే ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. పనులు చేసి మూడు నెలలవుతున్నా వేతనాలు అందడం లేదు. వేతనాలు ఎప్పుడు వస్తాయో అధికారులకు సైతం తెలియని పరిస్థితి. నెల్లిమర్ల నియోజకవర్గంలో పూసపాటిరేగ మండలంలో రూ.3.89 కోట్లు, నెల్లిమర్ల మండలంలో రూ. 3.10 కోట్లు, డెంకాడలో రూ. 2.60 కోట్లు, భోగాపురం మండలంలో రూ. 3.13 కోట్ల వరకు వేతనదారులకు బకాయిలున్నాయి. నియోజకవర్గంలో మెటీరియల్ కాంపొనెంట్‌లో సుమారు 21 కోట్ల రూపాయల వరకు బకాయిలున్నాయి. ఇదిలా ఉంటే ఉపాధిహామీ పథకానికి లక్ష్యాలు నిర్దేశించి వాటిని చేరుకోవాలని దిగువ స్థాయి సిబ్బందిపై అధికారులు ఒత్తిడి తీసుకువస్తున్నారు. వారం వారం వేతనాలు వస్తే వేతనదారులు పనులపై ఆసక్తి చూపుతారని.. వేతనాలు ఇవ్వకుండా లక్ష్యాలు చేరుకోవాలని అనడం ఎంతవరకు సమంజసమని సిబ్బంది లోలోపల మధనపడుతున్నారు. వారానికి ఒకసారి సమీక్షల పేరిట వేధింపులకు గురి చేస్తున్నారని దిగువస్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వేతనదారులకు పెండింగ్ బిల్లులు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని వేతనదారులు, సిబ్బంది కోరుతున్నారు.

వేతనాలు అందక ఇబ్బందులు

వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నాం. రెండు నెలలకు పైబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నాం. చేసిన పనికి సకాలంలో డబ్బులు చెల్లించకపోతే ఎలా బతికేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి బిల్లులు చెల్లించాలి.

– ఎస్. గౌరి, వేతనదారు, పూసపాటిరేగ

గతంలో సకాలంలో అందేవి..

గత ప్రభుత్వంలో వారానికి ఒకసారి వేతనాలు అందేవి. నేటి పరిస్థితి చూస్తే 10 నెలలుగా వేతనాలు అందకపోయినా అడిగే నాథుడే లేనట్లుంది. వేతనాలు ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి. అధికారులు దృష్టి సారించి వేతనదారులను ఆదుకోవాలి.

– పి. రామనర్సి, వేతనదారు పూసపాటిరేగ.


నడిపల్లిలో వేతనాలు అందకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న వేతనదారులు (ఫైల్)

నగర పరిధిలో పందుల పెంపకం నిషేధం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగర పరిధిలో పందులను పెంచరాని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నగర పరిధికి వెలుపల 3 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో పందుల పెంపక కేంద్రాలు నిర్వహించుకోవాలన్నారు. ఇందుకోసం నగర పరిధికి వెలుపల నిర్దేశిత స్థలం కోసం రెవెన్యూ విభాగానికి నివేదించేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఇందుకు ముందస్తుగా నగరంలో ఎంతమంది పందుల పెంపకం దారులు ఉన్నారు.. వారి వద్ద ఎన్ని పందులు ఉన్నాయన్న విషయాన్ని సేకరించామన్నారు. 60 మంది పెంపకందారుల వద్ద సుమారు 250 పందుల వరకు ఉన్నట్లు గుర్తించామని, ఇందుకు ఎంత స్థలం అవసరమో రెవెన్యూ అధికారులకు నివేదిస్తామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పందులను పెంచినట్లు గుర్తిస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం మరో మూడు నెలల గడువు పొడిగించిందన్నారు. వ్యక్తిగత దరఖాస్తులను కూడా తక్షణమే పరిష్కరించేందుకు అవసరమైన చొరవ చూపాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. నగరంలో అనధికార ఫ్లెక్సీలు, పోస్టర్లు లేకుండా చూడాలన్నారు. అనధికార ప్రకటన బోర్డులు గుర్తించి అపరాధ రుసుం విధించాలని స్పష్టం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టీపీఓ అప్పలరాజు, టీపీఎస్ అనిత పాల్గొన్నారు.

పోస్టల్ కార్యాలయం నిర్మాణానికి ప్రతిపాదనలు

- ఏపీ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ప్రకాష్


స్థల పరిశీలన చేస్తున్న పోస్టుమాస్టర్ జనరల్ ప్రకాష్, తదితరులు

పూసపాటిరేగ: భోగాపురంలో నిర్మించనున్న విమానాశ్రయానికి అనుసంధానంగా 50 లక్షల రుపాయలతో పోస్టల్ కార్యాలయం నిర్మించనున్నట్లు ఏపీ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కె. ప్రకాష్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో పోస్టల్ కార్యాలయానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ నుంచి విమానాశ్రయం నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజులలో స్పీడ్‌పోస్ట్ సేవలు ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాలకు ఇక్కడ నుంచి అందించనున్నామన్నారు. అనంతరం స్థానిక పోస్టల్ కార్యాలయానికి వెళ్లి సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్ సూపరింటిండెంట్ కె. శ్రీనివాసరావు, ఏఎస్పీలు ఓఎస్ మధు, సుందరనాయుడు, భోగాపురం పోస్టుమాస్టర్ పప్పల శ్రీనివాసరావు, ఏపీఎం జి.రవి, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌వేను తెరిపించండి

- జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న బీశెట్టి బాబ్జి

విజయనగరం రూరల్: పట్టణంలోకి ప్రవేశించే వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నందున రద్దీని తగ్గించేందుకు వీలుగా సంతకాల వంతెన కింద నిర్మించిన సబ్ వేను తెరిపించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజును శుక్రవారం ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగరంలోని పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖపట్నం నుంచి వచ్చే బస్సులు, కార్లు, మోటారు సైకిళ్లు, ఆటోలు, ఇతర వాహనాలతో ఎత్తు బ్రిడ్జి నిరంతరం రద్దీగా ఉంటోందన్నారు. సంతకాల వంతెన నిర్మాణం చేసినప్పుడే అప్పటి ప్రభుత్వం ముందుచూపుతో వంతెన కింద సబ్ వేను ఏర్పాటు చేసిందని చెప్పారు. దాన్ని తెరిపిస్తే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చిన్న చిన్న వాహనాలు సులువుగా రాకపోకలు సాగిస్తాయని, దీంతో ట్రాఫిక్ ఇబ్బందులుండవన్నారు. గురజాడ అప్పారావు ఇంటి పరిసరాలను పరిశుభ్రం చేసి చిన్నపాటి ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజును కోరగా ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయనతో పాటు పౌరవేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, తాడేపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ

వేపాడ: స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్ఓ ఎస్.జీవన రాణి శుక్రవారం మధ్యాహ్నం సందర్శించారు. ఆసుపత్రిలో రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. మందుల నిల్వలు, వ్యాధి నిరోధక టీకాలపై వివరాలు సేకరించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు శతశాతం వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మందుల స్టాకు రిజిస్టరు పరిశీలించారు. వైద్యాధికారి అనిల్‌కుమార్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీహెచ్ఓ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలసత్వం వద్దు..

లక్కవరపుకోట : వైద్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని, ప్రతీ ఒక్కరు సమయపాలన పాటించాలని లేదంటే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారిణి జీవనరాణి హెచ్చరించారు. మండల కేంద్రంలోని లక్కవరపుకోట పీహెచ్‌సీని ఆమె శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఓపీపై ఆరా తీశారు. ప్రస్తుత గదిని పరిశీలించి తగు సూచనలు చేశారు.

వినతి..



గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు అమరావతిలో గిరిజన సంక్షేమశాఖ అదనపు డైరెక్టర్ సరస్వతిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో చూపించిన పోస్టుల్లో సీఆర్‌టీలను కూడా చూపించారని.. ఈ పరిస్థితిలో వాటి భద్రతపై స్పష్టత ఇవ్వాలని కోరారు. – విజయనగరం అర్బన్

ఎక్సలెన్స్ అవార్డు



భోగాపురం మండలం సుందరపేట సీహెచ్‌సీ ఆస్పత్రి సీనియర్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కె. రామారావుకు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు ఇచ్చారు. ఆంధ్రా మెడికల్ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రత్నకుమారి, శివ కల్యాణి, శిరీష, పూర్ణేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

– పూసపాటిరేగ

ప్రత్యేక అలంకరణలో కామాక్షిదేవి..



రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతిన్న ఉమాసదా శివాలయంలో కామాక్షి అమ్మవారికి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు రేజేటి మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని పట్టుచీర, పుష్పాలతో విశేషంగా అలంకరించి.. కుంకుమ పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు.

– నెల్లిమర్ల రూరల్

కౌన్సిల్ సమావేశం రసాభాస

- కుర్చీ కోసం ఛైర్‌పర్సన్, కౌన్సిలర్ మధ్య వాగ్వాదం


సమావేశంలో కేకలు వేసుకుంటున్న సభ్యులు

నెల్లిమర్ల: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన నెల్లిమర్ల కౌన్సిల్ సన్నాహక సమావేశం రసాభాసగా మారింది. ఈ నెల 29న జరగనున్న మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి సంబంధించి స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎవరు హాజరు కావాలి.. ఏయే తీర్మానాలు ఉంటాయి అనే అంశాలపై చర్చించేందుకు ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం చేపట్టారు. సమావేశంలో పాల్గొన్న ఒకటో వార్డు కౌన్సిలర్ కింతాడ కళావతి తనకు కుర్చీ వెయ్యలేదని ఛైర్‌పర్సన్‌పై ధ్వజమెత్తారు. ఈ విషయమై ఇరువురి మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. తాను ఛైర్‌పర్సన్ అని, మర్యాద ఇవ్వాలని బంగారు సరోజిని అనగా.. ఇరువురం కౌన్సిలర్లమే అని కళావతి ఎద్దేవా చేశారు. అలాగే 29న జరిగే సమావేశంలో కేవలం కౌన్సిలర్లు మాత్రమే పాల్గొనాలన్న అంశంపై జరిగిన చర్చలో కౌన్సిలర్లు రెండు గ్రూపులుగా విడిపోయి కేకలు వేసుకున్నారు. సన్నాహక సమావేశమే ఇలా రసాభాసగా మారితే కౌన్సిల్ సమావేశం ఇంకెంత గందరగోళంగా ఉంటుందోననే చర్చ సర్వత్రా జరుగుతోంది.

ఉగ్రవాదుల దాడి దారుణం

విజయనగరం లీగల్:

జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని విజయనగరం బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు ఎదుట విజయనగరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొద్దిసేపు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విజయనగరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిశెట్టి రవిబాబు మాట్లాడుతూ.. ఉగ్రవాద చర్యలను దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల వారు ఖండించాలన్నారు. ఉగ్రవాదుల ఏరివేతకే కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు విజయనగరం బార్ అసోసియేషన్ తరఫున సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో విజయనగరం బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్. సురేష్, తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం లీగల్: నిరసన వ్యక్తం చేస్తున్న విజయనగరం బార్ అసోసియేషన్ సభ్యులు


నెల్లిమర్ల : నిరసన తెలియజేస్తున్న వామపక్ష నాయకులు

నిరసన

నెల్లిమర్ల: ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక మొయిద జంక్షన్‌లో సీపీఐ,సీపీఎం న్యూ డెమక్రసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఎం. పాపారావు, సీపీఎం మండల కార్యదర్శి కె. రామారావు మాట్లాడుతూ.. అమాయకులైన 26 మంది పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం చాలా దారుణమన్నారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కాళ్ల అప్పలసూరి, కనకల పద్మనాభం, నడిపిన నారాయణమూర్తి, ఆల్తి రామచంద్రరావు, చీర లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.